క్లుప్తంగా

కూలీల సంఖ్య పెంచాలి

హనుమంతునిపాడు: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి టీఏలు, ఎఫ్ఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న కూలీలకు పని లేదనకుండా పని కల్పించాలన్నారు. ప్రతి రోజు 23 పంచాయతీల్లో 5 వేల మంది కూలీలు పనిచేసేటట్లు ఉండాలన్నారు. కూలీల సంఖ్య పెంచాలన్నారు. పని ప్రాంతంలో కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏపీఓ వినయ్, టీఏలు దివ్యవాణి, రామ్‌తుల్లా, సుబ్బారెడ్డి, శశి పాల్గొన్నారు.

పాలేటి గంగమ్మ తిరునాళ్ల ప్రారంభం


గంగమ్మ తల్లి మూలవిరాట్

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాపురం సమీపంలో పాలేటి నది ఒడ్డున వెలసిన పాలేటి గంగమ్మ తల్లి తిరునాళ్ల బుధవారం ప్రారంభమైంది. 15న గ్రామోత్సవం, 16న తిరునాళ్ల, 17న పొంగళ్లతో తిరునాళ్ల ముగియనుంది. 13వ శతాబ్దంలో వెలసిన గంగమ్మ తల్లి యాదవులకు కులదైవంగా మారింది. కాటమరాజు పరిపాలించిన గడ్డగా, మనోసిద్ధి మహారాజు కాటమరాజుకు భీకర యుద్ధం అనంతరం అమ్మవారు వెలసి ఇక్కడ పూజలు అందుకుంటుంది. తిరునాళ్లకు బయటి రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

ఇళ్లకూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: ప్రతి ఒక్కరూ తమ ఇళ్లకు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని సీఐ సీహెచ్ హజరత్తయ్య తెలిపారు. ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరుతూ స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ప్రజలు ఎక్కువగా విహార యాత్రలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే అవకాశం ఉందని, దీంతో చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలను అరికట్టవచ్చని, ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్సై బి.మహేంద్ర, ఏఎస్సై షేక్ మహబూబ్ బేగ్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బాలికల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, టీచర్లు, కిశోర బాలికలు

పామూరు: బాలికల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. మండల కేంద్రమైన పామూరు 4వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం, 3, 4 సచివాలయాల పరిధిలో బుధవారం కిశోరి వికాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ పద్మజ మాట్లాడుతూ బాలికలను విధిగా పాఠశాలకు పంపాలన్నారు. 14 ఏళ్ల లోపు బాలికలతో ఎక్కడైనా పరిశ్రమలు, కర్మాగారాల్లో పనిచేయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమన్నారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలని, ఎవరైనా బాల్య వివాహాలకు మొగ్గుచూపితే వారిపై కేసు నమోదుకు సిఫార్సు చేస్తామన్నారు. బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. పౌష్టికాహారం ఆవశ్యకత, బాలికల హక్కులపై అవగాహన చేసి అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వంకేశ్వరం నాగవాణి, మహిళాపోలీసులు అనూష, గాయత్రి, అంగన్‌వాడీ టీచర్లు రమీజా, మెహరాజ్, రూహి, రామసుబ్బులు పలువురు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో ఇబ్బందులు

- టీపీ నగర్‌లో సుమారు 800 గృహాలు
- మూతబడిన ప్రభుత్వ మినరల్ వాటర్ ప్లాంట్
- మంచినీటి కుళాయిలకు మోటార్లు ఏర్పాటు
- ట్యాంకర్ల నుంచి నీరు కొనుక్కుంటున్న కాలనీ వాసులు


టీపీ నగర్‌లో మూతబడిన మినరల్ వాటర్ ప్లాంట్

సింగరాయకొండ:

మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ టీపీ నగర్‌లో రక్షిత మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉండటంతో కాలనీలో సగం గృహాలకు తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా నీరు కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా అయ్యే కుళాయిలకు మోటార్లు ఏర్పాటు చేయడంతో చివరి వరకు నీరు సక్రమంగా సరఫరా కాక నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు.

మూతబడిన మినరల్ వాటర్ ప్లాంట్

టీపీ నగర్‌లో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సుమారు 10 లక్షల రూపాయల అంచనా వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్లాంటు మరమ్మతులకు గురి కావడంతో సుమారు 2 లక్షల రూపాయల నిధులతో మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం చాలా నెలలుగా ప్లాంటు మరమ్మతుల కారణంగా మూతబడటంతో ప్రజలు కాలనీలో ఉన్న ప్రైవేటు వాటర్ ప్లాంటుపై ఆధార పడాల్సిన దుస్థితి ఏర్పడింది. టీపీ నగర్ కాలనీలో రక్షిత మంచినీటి పథకం నుంచి కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నీటి సరఫరా సమయంలో కుళాయిలకు మోటార్లు ఏర్పాటు చేయడంతో నీటి సరఫరా అస్తవ్యస్తమై కొన్ని ప్రాంతాలకు మాత్రమే తాగునీరు అందుతోంది. మిగిలిన ప్రాంతాలకు తాగునీరు సరఫరా కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాలనీలో సుమారు 800 గృహాలు ఉండగా వాటిలో 400 గృహాలకు కుళాయిల నుంచి నీరు సరఫరా కావటం లేదని, కుళాయిలకు మోటార్లు ఏర్పాటు చేయడమే ఈ దుస్థితికి కారణమని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో 12 బజార్లు ఉండగా సుమారు 6 బజార్లకు నీరు సరఫరా కావటం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్ల ద్వారా నీరు తెచ్చుకుంటున్నామని, అవి అందుబాటులో లేకపోతే ట్యాంకరు 600 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సరఫరా సమయంలో మోటార్లు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని, మినరల్ వాటర్ ప్లాంట్‌ను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

> **బకాయి చెల్లించాల్సి ఉంది:**
> టీపీ నగర్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ మూతబడింది. ఆ ప్లాంటుకు కరెంటు బకాయి సుమారు రూ.4 లక్షల వరకు ఉంది. ఆ బకాయి కడితే తప్ప ప్లాంట్ పునరుద్ధరించే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఆ నిధులు పంచాయతీ సమకూర్చాల్సిందే తప్ప మా శాఖ ద్వారా నిధులు కేటాయింపు సాధ్యం కాదు. రక్షిత మంచినీటి సరఫరా సమయంలో కుళాయిలకు మోటార్లు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుని తాగునీటి ఎద్దడి తీరుస్తాం.
> రమేష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, సింగరాయకొండ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

పార్టీ పటిష్టత కోసం సమష్టిగా కృషి చేయాలి

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

మర్రిపూడి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల కేంద్రం మర్రిపూడి పడమటి బజారులోని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఇనుకొల్లు సుబ్బారెడ్డి నివాసంలో బుధవారం మండల కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిమూలపు సురేష్ హాజరై మాట్లాడుతూ మర్రిపూడి మండలంలో మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. గ్రామ స్థాయిలో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు పనులు చేస్తే పాముకు పాలు పోసినట్లని, ముఖ్యమంత్రి స్థాయిలో నారా చంద్రబాబునాయుడు మాట్లాడటం విడ్డూరం అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రజలకు పనులు చేసినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఒక వర్గానికి మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న శాపం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా నేటికీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక పోయారన్నారు. రాష్ట్ర ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి అధికారం చేపట్టిందని, ప్రశ్నించిన వారిపై కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా బెదరకుండా నిలబడాలన్నారు. రాబోవు రోజుల్లో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, మున్ముందు మనకు మంచి రోజులు వస్తాయన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు నియోజకవర్గంలో అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి సురేష్ భరోసా ఇచ్చారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలు, నాయకులకు సరైన న్యాయం జరగలేదని, భవిష్యత్తులో కార్యకర్తలకు జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తాననడం సంతోషంగా ఉందన్నారు. కష్టకాలంలో అందరం ఏకతాటిపై ఉండి పార్టీని అభివృద్ధి పర్చుకుందామన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఇనుకొల్లు సుబ్బారెడ్డి, మాకినేని వెంకట్రావు, బోద రమణారెడ్డి, మాచేపల్లి నాగయ్య, సర్పంచ్ కదిరి భాస్కర్, బి.నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, ఇనుకొల్లు మాదిరెడ్డి, దిండు నర్సింహారావు, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం


బొంతవారిపల్లె కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


సీతారాముల ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పామూరు: మండలంలోని దూబగుంట్లలో కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం సీతా రాముల ఉత్సవ దేవతామూర్తుల శాంతి కల్యాణోత్సవం రుత్వికుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు ఉదయం పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం సీతా, రామ చంద్ర ఉత్సవమూర్తులను కల్యాణవేదికపై ఉంచి అర్చకులు సహదేవయ్య ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. కందుల శ్రీనివాసులురెడ్డి, ఉడుముల ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని బొంతవారిపల్లెలో కోదండరామస్వామి కల్యాణోత్సవం బుధవారం కనులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు పంచాగ్నుల రామమూర్తి స్వామి మూలవిగ్రహమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారామ ఉత్సవ విగ్రహమూర్తులకు వేదమంత్రాల నడుమ శాంతి కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా దుగ్గా రఘురామిరెడ్డి, రామరాజమ్మ, హర్షవర్ధన్‌రెడ్డి, ఊషా దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం సీతారామ, లక్ష్మణ, హనుమంత ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

తెలుగు పోస్టులు తీసేయడం తగదు

కొండపి: పాఠశాల పునర్వవస్థీకరణలో భాగంగా 1వ తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించే ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు పోస్టు తీసేయడం కూటమి ప్రభుత్వానికి తగదని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గవిని శివశంకర్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి కోర్సులు తెలుగులో బోధించాలనే నిబంధనలు ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు మాతృభాషకు పెద్దపీట వేస్తుంటే ఇక్కడ మాత్రం పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు.

పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

కనిగిరిరూరల్: గోదావరి ప్రాణహిత సరస్వతి నదుల త్రివేణి సంగమ స్థానమైన కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు కనిగిరి డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ మొహ్మద్ సయానా బేగం అన్నారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. యాత్రికుల, భక్తుల సౌకర్యార్థం కనిగిరి డిపో నుంచి ఈ నెల 17, 23 తేదీల్లో రాత్రి 9గంటలకు సరస్వతి పుష్కరాలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని తెలిపారు. కాళేశ్వరం, రామన్న దేవాలయాలు, వరంగల్ భద్రకాళీ, వేయి స్తంభాల గుడిని దర్శించవచ్చన్నారు. టికెట్ ధర రూ.2,210గా నిర్ణయించామన్నారు.

దశదిన కర్మకు హాజరైన మాజీ మంత్రి సురేష్


కుమారికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్


రేవంత్‌కు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రాయపాటి నరసింగరావు భార్య కుమారి దశదిన కర్మకు ఆ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి కాటా మాధవరావు, మాజీ ఎంపీటీసీ వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, వెన్నపూస మాల్యాద్రి రెడ్డి, తన్నీరు మాల్యాద్రి పాల్గొన్నారు.

రేవంత్‌కు కూడా..

పొన్నలూరు: స్థానిక బాప్టిస్ట్ నగరకు చెందిన గంథం సింగయ్య కుమారుడు గంథం రేవంత్‌కుమార్ ఇటీవల తాటి చెట్టు ఎక్కి కింద పడి తీవ్ర గాయాలతో హాస్పిటల్లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం రేవంత్ మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం రేవంత్ కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి కాటా మాధవరావు, బోడా మల్లికార్జునరావు, జ్యేష్ఠ వేణు, బాలు ఈశ్వర్ రెడ్డి ఉన్నారు.

పాలేటిపల్లి తిరునాళ్లకు భారీ బందోబస్తు

- డ్రోన్ కెమెరాతో ప్రత్యేక పోలీస్ నిఘా..
- డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్


మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరిరూరల్: పీసీపల్లి మండలం వెంగళాపురం సమీపంలో ఈ నెల 16న జరిగే పాలేటి గంగమ్మ తిరునాళ్లకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తిరునాళ్ల సందర్భంగా 9 ప్రభలు, ఒక కోలాట ప్రదర్శన వేదిక ఉన్నందున భక్తుల ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరునాళ్లకు వచ్చే వాహనదారులు పోలీస్ శాఖ సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించారు. తిరునాళ్ల రోజు సాయంత్ర నాల్గు గంటల నుంచి తెల్లవారు జామున 3 గంటల వరకు కందుకూరు నుంచి కనిగిరికి వచ్చే వాహనాలు పామూరు మీదుగా కనిగిరికి, కనిగిరి నుంచి కందుకూరు వెళ్లే వాహనాలు పామూరు మీదుగా కందుకూరుకు వెళ్లాల్సి ఉందన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులు జాగ్రత్తలు పాటించాలని, తమ పిల్లలను వెంట తీసుకెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమిటీ నిర్వాహకులు పోలీసు వారు ఇచ్చిన సూచనలను, నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. తిరునాళ్ల ప్రదేశంలో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బందోబస్తుకు ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 23 మంది ఎస్సైలు, 200 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో సీఐ ఎస్‌కే ఖాజావలి, ఎస్సైలు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం

- రోడ్లు నిర్మానుష్యం
- దడ పుట్టిస్తున్న ఎండలు

కొండపి: రోహిణి కార్తి దగ్గర పడటంతో భానుడి ప్రతాపం మరింత పెరిగింది. ఫిబ్రవరి చివరి నుంచి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. రోజూ 30 డిగ్రీల నుంచి 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుంది. బుధవారం భానుడి భగభగలకు ప్రజలు మరింత ఉక్కిరిబిక్కిరయ్యారు. మండుటెండలతో ప్రజలు బెంబేలెత్తిపోయి సాయంత్రం ఐదు గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. భానుడు భగభగ మనడంతో పాటు గాలి లేక ఉక్కపోతతో వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భానుడి ప్రతాపంతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొండపి రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనుల్లో ఉన్న వాళ్లు ప్రయాణం చేయాలంటే హడలిపోతున్నారు. ప్రయాణ సమయంలో వడగాలికి భీతిల్లిపోతున్నారు. ఫ్యాన్లు, ఏసీల కింద కూర్చున్నా ఫలితం దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఎండ వేడిమికి బయటకు వచ్చిన ప్రజలు సేద తీర్చుకునేందుకు శీతల పానీయాల వైపు చూస్తుండటంతో కూల్ డ్రింక్స్, జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, తాటి ముంజలకు డిమాండ్ పెరిగింది.


ఎస్‌బీఐ సమీపంలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

నాణ్యమైన బేళ్లకే అధిక ధర


రైతులతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

కొండపి: నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందని కొండపి వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం వేలం సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేళ్లలో అన్య పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొగాకును అనధికారికంగా విక్రయించొద్దని చెప్పారు. బుధవారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని గుర్రప్పడియ, కె.అగ్రహారం, మూగచింతల, నెన్నూరుపాడు, చతుకుపాడు గ్రామాలకు చెందిన రైతులు 1227 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 885 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 342 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.280, కనిష్ఠ ధర కేజీ రూ.210, సరాసరి ధర కేజీ రూ.245.14గా నమోదైంది. వేలంలో 16 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

286 పొగాకు బేళ్ల తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో నిర్వహించిన వేలంలో వివిధ కారణాలతో 286 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. స్థానిక వేలం కేంద్రాన్ని బుధవారం ఆర్‌ఎం లక్ష్మణరావు పరిశీలించారు. తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1016 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 730 కొనుగోలు చేశారు. 286 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.280 పలకగా కనిష్ఠ ధర రూ.205 పలికింది.

సాంఘిక బహిష్కరణ అమానుషం


నిరసన వ్యక్తం చేస్తున్న అశోక్‌బాబు, నాయకులు

టంగుటూరు: కాకినాడ జిల్లా మల్లంలో మాలలను, గుడ్లూరు మండలం దప్పళంపాడులో మాదిగలను సాంఘిక బహిష్కరణ చేస్తా ఉంటే చూస్తూ ఊరుకోమని, సాంఘిక బహిష్కరణపై సాంఘిక శాఖ మంత్రి స్వామి స్పందించాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దప్పళంపాడు మాదిగలను సాంఘిక బహిష్కరణ చేయడం సిగ్గుచేటని, మాల, మాదిగల మధ్య ఉన్న వర్గీకరణ అంశం తమకు సంబంధించిందని, మాదిగలకు అన్యాయం జరిగినా, మాలలకు అన్యాయం జరిగినా అందరం కలిసి పోరాడుతామని అశోక్ హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి స్వామికి సూచించారు. మంత్రి స్పందించకుంటే దళిత, ప్రజా సంఘాల నాయకులు మంత్రి ఇంటి వద్ద నిరసన వ్యక్తం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో అరుంధతి నగర్ పెద్దలు శిఖా ఇజ్రాయేల్, ఆశీర్వాదం, లాజర్, అంబేడ్కర్ నగర్ పెద్దలు మేడిద బాలకోటయ్య, తుల్లిబిల్లి బాలకోటయ్య, కసుకుర్తి నరసింహారావు, మాలల జేఏసీ నాయకులు క్రాంతికుమార్ రాజు, సీహెచ్ భరత్ కుమార్, టి.అభిషేక్, ఆంటోనీ, రవి, భాస్కర్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

హనుమంతునిపాడు: లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు నాల్గవ రోజు వైభవంగా జరిగాయి. స్వామికి ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహించారు. స్వామిని గజవాహనంపై ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్యూలో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. అంకాలమ్మ తల్లి, అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక కత్తి సేవలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఏటా తిరునాళ్లకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. చెక్కా వంశస్తుల కోలాటం, పాటకచేరి అలరించాయి. ఎస్సై ఎం మాధవరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ గిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం కల్లి కంప ఉత్సాహంతో తిరునాళ్ల ముగియనుంది.


చెన్నకేశవస్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


కోలాటం వేస్తున్న మహిళలు


అంకాలమ్మ ఆలయంలో దర్శనానికి క్యూలో ఉన్న మహిళలు


విద్యుత్ దీపాలో అలంకరించి చెన్నకేశవస్వామి ఆలయం